తారామతిపేటలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు


అవగాహన సదస్సులో శాస్త్రవేత్తలు, రైతులు

అబ్దుల్లాపూర్‌మెంట్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ తారామతిపేట గ్రామంలో బుధవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి శాస్త్రవేత్త డాక్టర్ ఎస్. జెమీమా, క్రీడా శాస్త్రవేత్తల బృందం డాక్టర్ నాగార్జున, డాక్టర్ ప్రియా, డాక్టర్ సుధీర్, డాక్టర్ భార్గవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వానాకాలం పంటల విషయంలో రైతులు పాటించాల్సిన పద్ధతులపై పలు సలహాలు, సూచనలు చెప్పారు. పాడి పెంపకంతో పాటు మట్టి నమూనాలను సేకరించే పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పల్లవి, విస్తరణ అధికారి రఘు, మాజీ ఎంపీటీసీ వెంకటేష్, అంజయ్య, సతీష్, లింగమయ్య, మల్లేష్ లక్ష్మీనారాయణ, బాలరాజు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టాలి: రాగుల

వనస్థలిపురం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ చేపట్టాలని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం వనస్థలిపురం డివిజన్ అభ్యుదయనగర్‌కాలనీలో రూ.92లక్షలతో చేపట్టబోయే సీసీ రోడ్డు పనులకు కార్పొరేటర్ శంకుస్థాపన చేశారు. కాలనీల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు భవిష్యత్ తరాలకు ఉపయోగపడేవిధంగా నాణ్యతతో చేపట్టాలని ఆయన సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ విగ్నేశ్వరీ, అభ్యుదయనగర్‌కాలనీ అధ్యక్షుడు ఎం.గంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు సలావుద్దీన్, కార్యదర్శులు కృష్ణప్రసాద్, సీతారామరాజు, ప్రభాకర్‌రాజు, సాయికిరణ్‌గౌడ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలి: కళ్లెం

వనస్థలిపురం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్ ఆటోసాయినగర్‌కాలనీలో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్డు లెవల్ పనులను బుధవారం కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో కాలనీవాసులు భాగస్వాములై భవిష్యత్ తరాలకు ఉపయోగపడేవిధంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

హయత్‌నగర్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ ఏరియాలోని పవనగిరికాలనీ, సీఎస్‌ఆర్‌కాలనీ నుంచి బీఎంఎస్‌యాదవ్ కాలనీ వరకు రూ.26.20 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను బుధవారం స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంవత్సరం క్రితం టెండర్ అయిన పెండింగులో ఉన్న పనులను ఒక్కొక్కటి చేయిస్తున్నట్లు తెలిపారు. సీఎస్‌ఆర్ కాలనీ నుంచి బీఎంఎస్‌యాదవ్‌కాలనీ, లక్ష్మీనగర్, గాయత్రినగర్, వీరన్నగుట్ట కాలనీకి వెళ్లేందుకు మార్గాన్ని త్వరలో పూర్తి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సాయిలుగౌడ్, హరినాథ్, హరిప్రసాద్, కృష్ణగౌడ్, శ్రీనివాస్‌యాదవ్, రాజేందర్, సంజీవరెడ్డి, శేఖర్ యాదవ్, నరసింహుడు, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్ పాల్గొన్నారు.

రూ.40లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం

చంపాపేట, జూన్ 11(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్‌లోని రాజిరెడ్డినగర్‌కాలనీలో జీహెచ్‌ఎంసీ నిధులు రూ.40లక్షలతో త్వరలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి అన్నారు. కార్పొరేటర్ కాలనీలో బుధవారం పర్యటించి కాలనీ ప్రతినిధులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో 24ఫీట్ల వెడల్పుతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ గోపాలకృష్ణ, వర్క్‌ఇన్‌స్పెక్టర్ రాజు, కాలనీ ప్రతినిధులు క్రాంతికుమార్, బాల్‌రెడ్డి, జైహింద్‌రావు, రాంరెడ్డి, సోమేశ్వర్, బాలయ్య, ఈశ్వరయ్య, నాయకులు సుంకరి రమేష్‌గౌడ్, సుమిత్‌సింగ్ పాల్గొన్నారు.

రవీంద్రభారతి పాఠశాల సీజ్


రవీంద్రభారతి పాఠశాలను సీజ్ చేస్తున్న ఎంఈఓ శ్రీనివాస్

హయత్‌నగర్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ కుంట్లూర్ రోడ్డులో శ్మశానవాటిక పక్కనే ఏర్పాటు చేసిన రవీంద్రభారతి పాఠశాలను ఎంఈఓ శ్రీనివాస్ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశం మేరకు బుధవారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ శ్మశానవాటిక పక్కన పాఠశాల ఏర్పాటు చేయవద్దని పలుమార్లు యాజమాన్యం దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోలేదని తెలిపారు. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఇచ్చిన ఫిర్యాదుపై స్పందించిన అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. శ్మశానవాటిక పక్కనే పాఠశాల ఉండడం వల్ల విద్యార్థులకు కలిగే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని తాము ఫిర్యాదు చేశామని బీసీ సంఘం నాయకులు శ్రీహరి, శివ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన ఎంఈఓ

చంపాపేట, జూన్ 11(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్‌లోని కర్మన్‌ఘాట్, చంపాపేటలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను బుధవారం సరూర్‌నగర్ ఎంఈఓ బాసునాయక్ సందర్శించారు. ఆయా పాఠశాలలో కొనసాగుతున్న బడిబాట కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఆయా పాఠశాలలోని తరగతి గదులు, పరిసరాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ గురువారం పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయని, పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు పాఠ్య, నోటు పుస్తకాలు, యూనిఫాం అందించేందుకు సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మ, ఉపాధ్యాయులు నర్సింహారెడ్డి, గోవర్ధన్‌యాదవ్, పీడీ నర్సింహయాదవ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించండి

కొత్తపేట, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ పిలుపునిచ్చారు. మోహన్‌నగర్ మండల ప్రాథమిక పాఠశాల పరిధిలో బుధవారం ప్రొ.జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ పవన్‌కుమార్, ఎంఈఓ రామారావు, ప్రధానోపాధ్యాయుడు అంజనేయులు, ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు అమ్మ ఆదర్శ కమిటీ ప్రతినిధులు, బస్తీ నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి


మాట్లాడుతున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మల్లారెడ్డి

కొత్తపేట, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించాలని ఎల్బీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మల్లారెడ్డి అన్నారు. రహదారి భద్రత అవగాహనపై బైక్ బజార్ నగరంలోని ఈవీ రెంటల్స్ ఆధ్వర్యంలో బుధవారం కామినేని చౌరస్తా వద్ద బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సమీపంలోని శివగంగకాలనీలో గల బైక్ బజార్ ఈవీ రెంటల్స్ ఆవరణలో ఆయన మాట్లాడారు. ప్రమాదాల తీవ్రతను తగ్గించడానికి బైక్ రైడర్లు హెల్మెట్ పెట్టుకోవాలని అన్నారు. ఆర్టీఓ అధికారి రవికుమారి, బీజినెస్ హెడ్ సత్బీర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



కాళేశ్వరం బ్యారేజీల కుంగుబాటుపై విచారణలో భాగంగా జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట హాజరయ్యేందుకు బషీర్‌బాగ్‌లోని బీఆర్‌కేభవన్‌కు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వస్తున్న నేపథ్యంలో ఆయనను కలిసేందుకు ఎల్‌బీనగర్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ శ్రేణులు భారీ ఎత్తున తరలివెళ్లారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి నాయకత్వంలో మాజీ కార్పొరేటర్లు, పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి బషీర్‌బాగ్ వరకు ఊరేగింపుగా తరలివెళ్లారు. - ఎల్‌బీనగర్, ఆంధ్రజ్యోతి

శానిటేషన్ స్పెషల్‌డ్రైవ్ ప్రారంభం

చాదర్‌ఘాట్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మూసారాంబాగ్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్త కుప్పలు, మట్టికుప్పలు, చెట్ల కొమ్మలను తొలగించేందుకు వీలుగా జీహెచ్‌ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 శానిటేషన్ విభాగం బుధవారం నుంచి స్పెషల్ డ్రైవ్ ప్రారంభించింది. సర్కిల్-6 డీసీ జయంత్, ఏఎంహెచ్‌వో శ్రీనివాస్ రుద్రతో కలిసి మూసారాంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను ప్రారంభించారు. ఈ శానిటేషన్ డ్రైవ్ మూడు రోజుల పాటు కొనసాగనుందని కార్పొరేటర్ వివరించారు. డివిజన్‌లోని 9మంది ఎస్‌ఎఫ్ఏ కింద సుమారు వంద మంది శానిటేషన్ సిబ్బంది ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీ, లెజెండ్ అపార్ట్‌మెంట్ లేన్, టీ జంక్షన్ ఎదురుగా ఉన్న లేన్, ఎస్‌బీఐ కాలనీ పార్క్ ఎదురుగా ఉన్న రోడ్డులో, లక్ష్మీనగర్‌కాలనీలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ జరిగింది. డివిజన్‌లో ఎక్కడైనా చెత్తకుప్పలు, మట్టికుప్పలు, చెట్ల కొమ్మలు పేరుకుపోయి ఉన్నట్లుగా గుర్తిస్తే శానిటేషన్ సిబ్బందికి తెలియజేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో శానిటేషన్ జవాన్ రాజు, రాంబీ ఇన్‌చార్జి కల్యాణ్, ఎస్‌ఎఫ్‌ఐలు శ్రీను, సుభాష్, నర్సింగ్, శ్రీను, ముజీబ్, బీజేపీ నాయకులు కొంగర ప్రవీణ్, పున్‌రెడ్డి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.


ఆర్‌కేపురం టెలిఫోన్‌కాలనీలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి


మూసారాంబాగ్‌లో శానిటేషన్ స్పెషల్‌డ్రైవ్ ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డి, డీసీ జయంత్, ఏఎంహెచ్‌వో శ్రీనివాస్

డివిజన్ల వారిగా ఈనెల 25 వరకు..

మలక్‌పేట సర్కిల్-6 పరిధిలో ఈనెల 3న ప్రారంభమైన శానిటేషన్ స్పెషల్‌డ్రైవ్ ముందుగా సైదాబాద్ డివిజన్‌లో నిర్వహించారు. తాజాగా మూసారాంబాగ్ డివిజన్‌లో ప్రారంభించినట్లు ఏఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్‌రుద్ర తెలిపారు. ఈనెల 16వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఓల్డ్‌మలక్‌పేట డివిజన్‌లో, 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు అక్బర్‌బాగ్‌లో 23వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఆజంపుర, చావునీ, డబీర్‌పుర డివిజన్లలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు.

ఆర్‌కేపురంలో..

ఎల్‌బీనగర్ : జీహెచ్‌ఎంసీ చేపట్టిన మాన్‌సూన్ శానిటేషన్ స్పెషల్‌డ్రైవ్ కార్యక్రమం బుధవారం ఆర్‌కేపురం టెలిఫోన్‌కాలనీలో కార్పొరేటర్ వీరన్నగారి రాధాధీరజ్‌రెడ్డి ప్రారంభించారు. అందులో భాగంగా ఆర్‌కేపురం, టెలిఫోన్‌కాలనీ, హరిపురికాలనీ, న్యూహరిపురికాలనీ, సాగర్‌హిల్స్, యాదవనగర్‌కాలనీ, ఈస్ట్ యాదవనగర్‌కాలనీ, మార్గదర్శికాలనీ, ద్వారకానగర్, సౌభాగ్యపురం, ఇందిరానగర్‌కాలనీ ప్రాంతాల్లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ చేపట్టి కాలనీల రోడ్లను, ఖాళీ ప్రదేశాలను శుభ్రం చేసి ప్రత్యేక వాహనాల ద్వారా చెత్తను ఎత్తివేశారు. దోమల నివారణకు మందులను పిచికారి చేయించారు. కార్యక్రమంలో సరూర్‌నగర్ సర్కిల్ పారిశుధ్య విభాగం డీఈ చందనచౌహాన్, శానిటరీ సూపర్‌వైజర్ బుచ్చయ్య, ఎస్‌ఎఫ్‌ఏలు, జవాన్లు, పారిశుధ్య సిబ్బంది, ఎంటమాలజీ సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

చాదర్‌ఘాట్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు దిల్‌సుఖ్‌నగర్‌లోని స్ఫూర్తి డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. పలు పేరొందిన కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొని 2,500 మంది యువతీ, యువకులకు రాత పరీక్షలు నిర్వహించాయి. అర్హత కలిగిన అభ్యర్థులను ఆయా కంపెనీల ప్రతినిధులు ఎంపిక చేశారు. కార్యక్రమంలో స్ఫూర్తి కళాశాల సీఈవో హోలీధర్‌రెడ్డితో పాటు ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.



రంగారెడ్డి జిల్లా కోర్టు జడ్జి సుదర్శన్ జన్మదిన వేడుకలను ఎల్బీనగర్‌లోని అనాథ విద్యార్థి గృహంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేశారు. అనాథ విద్యార్థి గృహానికి సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో గృహ అధ్యక్షుడు మార్గం రాజేష్, విద్యార్థులు పాల్గొన్నారు. - ఎల్‌బీనగర్, ఆంధ్రజ్యోతి

బండ్లగూడలో మధుయాష్కీ పర్యటన


బండ్లగూడలో నెలకొన్న సమస్యలను పరిశీలిస్తున్న మధుయాష్కీగౌడ్

మన్సూరాబాద్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ బండ్లగూడ గ్రామంలో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ బుధవారం పర్యటించారు. ఇందులో భాగంగా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న శిథిలావస్థలోని గోడలు, వర్షానికి కురిసే రేకులు, బండలపై ఏర్పడ్డ రంధ్రాలు, మరుగుదొడ్ల వద్ద సమస్యలను పరిశీలించి చలించిపోయారు. ఇటీవల పాఠశాలకు కేటాయించిన స్థలంలో భవన నిర్మాణం గురించి డీఈఓ, ఇతర అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన మధుయాష్కీ నిర్మాణం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తాత్కాలిక ఉపశమనం కోసం తనతో పాటు విచ్చేసిన నాయకులు, బండ్లగూడ గ్రామ కమిటీ సభ్యులచే ఒక్కొక్కరి వద్ద రూ.1000 చొప్పున అందించాలని కోరిన ఆయన వచ్చిన మొత్తాన్ని ప్రధాన సమస్యలను పరిష్కరించాలని సూచించి అందజేశారు. అదేవిధంగా గ్రామంలో అడ్డగోలుగా తవ్వేసిన రోడ్లను, మహిళా భవనాన్ని పరిశీలించిన మధుయాష్కీ వెంటనే రోడ్లు నిర్మించాలని, మహిళా భవనంలో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్, వజీర్ ప్రకాశ్‌గౌడ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు చెరుకు భవానీశంకర్‌గౌడ్, నాయకులు పాశం అశోక్‌గౌడ్, బుడ్డ సత్యనారాయణ, బీమిడి రామకృష్ణారెడ్డి, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తెలంగాణ మాల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


మంత్రి వివేక్ వెంకటస్వామిని సన్మానించి వినతిపత్రం అందజేస్తున్న బేర బాలకిషన్

ఎల్‌బీనగర్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మాల కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేయాలని తెలంగాణ మాలల ఐక్యవేదిక వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు బేర బాలకిషన్ కోరారు. రాష్ట్ర మంత్రిగా బాధ్యతలను స్వీకరించిన వివేక్ వెంకటస్వామిని బుధవారం తెలంగాణ రాష్ట్ర మాలల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బాలకిషన్ మాట్లాడుతూ అనేక పోరాటాలు, ఉద్యమాల ద్వారా మాల సామాజిక వర్గానికి మంత్రి పదవి సాధించుకోవడం అదీ వివేక్ వెంకటస్వామికి రావడం మాలలు సాధించిన విజయమన్నారు. తెలంగాణ మాల కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేయాలని ఆయన కోరారు. వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి ఇచ్చిన సోనియాగాంధీకి, రాహుల్‌గాంధీకి, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్‌రెడ్డిలకు తెలంగాణ మాల సంఘాల తరఫున ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కష్టకాలంలో పార్టీ జెండా మోసిన వారికే పదవులు

- స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి


మాట్లాడుతున్న స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, పక్కన మహేశ్వరం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్, దేప తదితరులు

ఎల్‌బీనగర్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచి పార్టీ జెండా మోసిన వారికే పదవులు వస్తాయని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్, పార్టీ పరిశీలకుడు శివసేనారెడ్డి స్పష్టం చేశారు. బుధవారం సరూర్‌నగర్‌లో మహేశ్వరం నియోజకవర్గ బ్లాక్-2 కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం జరిగింది. పీసీసీ ప్రధాన కార్యదర్శి దారాసింగ్, మహేశ్వరం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డిలతో కలిసి శివసేనారెడ్డి సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాసంక్షేమ పథకాలను ప్రజల్లో మరింతగా తీసుకెళ్లాలని సూచించారు. అర్హులకు సంక్షేమ ఫలాలు అందేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నిరంతరం ప్రజల మధ్య ఉండేవారికి గుర్తింపు ఇవ్వడంతో పాటు పదవులు ఇవ్వాలని తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సహా పార్టీ అధిష్ఠానం భావిస్తోందన్నారు. సమావేశంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ తీగల అనితారెడ్డి, మాజీ మేయర్ పారిజాత నర్సింహారెడ్డి, అమరేందర్‌రెడ్డి, బోయిని శంకర్‌యాదవ్, పున్న గణేష్‌నేత, చిలుక ఉపేందర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నూతన జడ్జిల పరిచయ కార్యక్రమం

రంగారెడ్డి జిల్లా కోర్టులు : రంగారెడ్డి జిల్లా కోర్టులలో నూతనంగా బదిలీపై వచ్చిన జడ్జిల పరిచయ కార్యక్రమం బుధవారం బార్ అసోసియేషన్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్ మాట్లాడుతూ న్యాయమూర్తులు, న్యాయవాదులు పరస్పర సహకారంతో కేసులను త్వరితగతిన పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్జిలు శ్రీవాణి, అంకిత, శ్యామకుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, కార్యదర్శి కార్తీక్, జక్కుల వెంకట్, ప్రదీప్, అపర్ణ, శ్రీనాథ్, విజయచంద్రకిరణ్ పాల్గొన్నారు.

15న సుదర్శన నరసింహ హోమం

మన్సూరాబాద్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): విశ్వశాంతి, సమాజ శ్రేయస్సును కోరుతూ ఈనెల 15వ తేదీన శ్రీవైష్ణవ సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సుదర్శన నరసింహ హోమం నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు ఏవీఎల్‌ఎన్ ఆచారి తెలిపారు. ఈసందర్భంగా ఎల్బీనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో హోమానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏవీఎల్‌ఎన్ ఆచారి మాట్లాడుతూ దేవనాథ రామానుజజీయర్‌స్వామి పర్యవేక్షణలో మన్సూరాబాద్ చంద్రపురికాలనీలోని శ్రీవైష్ణవ సదనంలో నిర్వహించే ఈ హోమంలో స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలతో పాటు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కేవీ రమణాచారి, మాజీ కేంద్రమంత్రి సుముద్రాల వేణుగోపాలాచారి, ఇతర పెద్దలు పాల్గొంటున్నట్లు తెలిపారు. సమావేశంలో సంఘం ముఖ్య కార్యదర్శి కందాల కృష్ణమాచార్యులు, కోశాధికారి వెంకటరామ్ ప్రసాద్ పాల్గొన్నారు.

నేటి నుంచి పాఠశాలలు ప్రారంభం


బాటసింగారం ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం వంట సామగ్రిని శుభ్రం చేస్తున్న సిబ్బంది

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు ముగియడంతో సుమారు 50 రోజుల తర్వాత ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు తిరిగి బుధవారం ప్రారంభంకానున్నాయి. ఈ నేపథ్యంలో దుమ్ము, దూళీతో మూతపడ్డ ఆయా స్కూళ్లల్లో పరిశుభ్రత కార్యక్రమాలు జోరందుకున్నాయి. నగర శివారు అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో 17 జడ్పీహెచ్‌ఎస్, 42 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. అయితే అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా 20 స్కూళ్లలో రిపేర్స్, మెయింటనెన్స్ కోసం ప్రభుత్వం నుంచి సుమారు రూ. 20లక్షల నిధులు మంజూరు అయినట్లు ఏఈ తెలిపారు. వాటితో ఆయా పాఠశాలల్లో విద్యుత్, తాగునీటి సౌకర్యం, ప్లంబింగ్ తదితర పనులు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. బుధవారం పాఠశాలలు ప్రారంభం కానుండడంతో ఆయా ప్రభుత్వ పాఠశాల ఆవరణలో పేరుకుపోయిన చెత్తతో పాటు గడ్డిని డోజర్ సహాయంతో శుభ్రం చేశారు. అదేవిధంగా వాటర్ ట్యాంక్‌లు, టాయ్‌లేట్లు, తరగతి, ల్యాబ్ గదులను క్లీన్ చేయించారు. మధ్యాహ్న భోజనం గదులతో పాటు వంట సామగ్రిని నీటితో శుభ్రం చేశారు.

ఘనంగా చండీహోమం

చంపాపేట, జూన్ 11(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ సాగర్‌రింగ్ రోడ్డులోని సువర్ణభారతీ గోశాలలో బుధవారం తత్వం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మశ్రీ పాశర్లపాటి శ్రీనివాస బంగారయ్యశర్మ ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ సిద్ధార్థశర్మ చండీహోమంను ఘనంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పీఎం మోదీ 11ఏండ్ల సుపరిపాలనలో భాగంగా హోమాన్ని నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సంస్థాగత ఎన్నికల కో-రిటర్నింగ్ అధికారి, మహిళా మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు గీతామూర్తి, బీజేపీ సీనియర్ నేత మీనాక్షి గిరిధారి, కళ్యాణి పాల్గొన్నారు.

26న కుమ్మర్ల తొలిబోనం

- ఆషాఢమాసంలో అమ్మవార్లకు కుమ్మరులు మొదటి బోనం సమర్పించుకోవాలి : కొల్లూరి అనిల్‌కుమార్


గోల్కొండ కోటలో కుమ్మర్ల తొలిబోనం పండుగ కరపత్రాలు, ఆహ్వానపత్రికలను ఆవిష్కరిస్తున్న ఉత్సవ సమితి ప్రతినిధులు

ఎల్‌బీనగర్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ కుమ్మర్ల గోల్కొండ బోనాల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మొదటి బోనాన్ని ఈనెల 26న గోల్కొండ కోటలోని జగదాంబిక అమ్మవారికి సమర్పించనున్నట్లు తెలంగాణ కుమ్మర్ల గోల్కొండ బోనాల ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి కొల్లూరి అనిల్‌కుమార్ తెలిపారు. బుధవారం సరూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తొలిబోనంగా 425 బోనాలు సమర్పించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కుమ్మరులు తమ తమ ప్రాంతాల్లోని గ్రామ దేవతలకు మొదటి బోనం గోల్కొండలో సమర్పించే తొలిబోనంతో పాటు సమర్పించి మరుసటి ఆదివారం కుమ్మర్ల బోనాల జాతరను జరుపుకోవాలన్నారు. తెలంగాణ సంస్కృతి వైభవానికి ప్రతీకగా నిలిచే బోనాల ఉత్సవంలో ప్రధానపాత్ర వహిస్తున్న కుమ్మర్లను గ్రామ దేవతల దేవాలయాలలో పూజారులుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బోనాల ఉత్సవ సమితి కోశాధికారి దామ సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు చెలిమిల్ల ప్రేమ్‌కుమార్, ప్రచార కార్యదర్శి కాకులారం కృష్ణ, ఆహ్వాన కమిటీ చైర్మన్ కాకులారం శంకర్, మల్కాజిగిరి కుమార్, సిల్వేరి అనీల్ కుమార్, బి. సత్యం తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం

మన్సూరాబాద్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ శ్రీసాయినగర్ కాలనీలోని దుర్గాదేవి ఆలయ వింశతి (20వ) వార్షికోత్సవాలు బుధవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు పోచబోయిన గణేష్‌యాదవ్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని విశేషంగా అలంకరించి పంచామృత ఫలరస అష్టోత్తర శత కలశాభిషేకం, గణపతిపూజ, పుణ్యాహవచనం, అగ్నిప్రతిష్ఠ తదితర పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు చల్లా బాలమురళీకృష్ణశర్మ వేద మంత్రోచ్ఛరణల నడుమ నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

పెంచిన బస్సు చార్జీలను తగ్గించాలి: సీపీఐ

హయత్‌నగర్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): పెంచిన బస్సు చార్జీలను వెంటనే తగ్గించాలని రంగారెడ్డి జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం తుర్కయంజాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక్కసారిగా 20శాతం బస్సు చార్జీలు పెంచడం సరియైన పద్ధతి కాదని అన్నారు. దీని వల్ల విద్యార్థులు, రైతులు, కార్మికులకు, పేద ప్రజలపైన భారం పడుతుందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బస్సు చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి, బాలయ్య, బీరప్ప, బాల్‌రాజ్, నరేందర్, కాటమయ్య, అండాలు, సత్తమ్మ, సావిత్రి పాల్గొన్నారు.


10గంజాయి చాక్లెట్లు, పొగాకు ఉత్పత్తులు స్వాధీనం

హయత్‌నగర్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా కిరాణాషాపుల్లో గంజాయి చాక్లెట్లు, నిషేధిత పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తున్న ఇద్దరిని హయత్‌నగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 10 గంజాయి చాక్లెట్లు, రూ.40వేల విలువైన పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులిద్దరిని బుధవారం కోర్టుకు తరలించారు. హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని పుట్టపాక గ్రామానికి చెందిన గుండు శేఖర్(40) హయత్‌నగర్ మదర్ డెయిరీ వద్ద శుభోదయకాలనీలో నివాసం ఉంటూ కుంట్లూర్ రోడ్డులో దుర్గాభవానీ ట్రేడర్స్ పేరుతో కిరాణాషాపును నిర్వహిస్తున్నారు. కిరాణాషాపు ముసుగులో గంజాయి చాక్లెట్లు, పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో మంగళవారం రాత్రి దాడి చేశారు. అదే సమయంలో 10 గంజాయి చాక్లెట్లు కిరాణా షాపు యజమానికి ఇవ్వడానికి వచ్చిన రిషిశంకర్‌మిశ్రా(39)ని కూడా పోలీసులు అదుపులో తీసుకున్నారు. రిషిశంకర్‌మిశ్రా చౌటుప్పల్ ఆరెగూడెంలో ఉంటున్నారు. ఆయన సొంత గ్రామం చంద్రసాయినాతోలే, ముర శీయార్ జిల్లా చౌమరియార్ రాష్ట్రం. సెవన్ మీనార్ వట్టి, చార్మినార్ గోల్డ్ మునక్క పేరుతో ఉన్న 10 గంజాయి చాక్లెట్లు, వీటితో పాటు సుమారు రూ.40వేల విలువ గల పొగాకు ఉత్పత్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపైన కేసు నమోదు చేసిన పోలీసులు బుధవారం ఇద్దరిని రిమాండుకు తరలించారు.

పార్కును అభివృద్ధి చేయండి


సరూర్‌నగర్ : బడంగ్‌పేట్ కార్పొరేషన్ గుర్రంగూడ సమీపంలోని పోస్టల్ అండ్ టెలికామ్ ఎంప్లాయీస్ కాలనీలో గల దాదాపు 800 గజాల ఖాళీ స్థలంలో హెచ్‌ఎండీయే నిధులతో పార్కును అభివృద్ధి చేయాలని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డి.నర్సింగ్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎం.చంద్రమోహన్‌గౌడ్ అధికారులను కోరారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ పార్కు అభివృద్ధిపై ఇటీవల జిల్లా కలెక్టర్, హెచ్‌ఎండీయే కమిషనర్, మునిసిపల్ కమిషనర్ తదితరులకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేసినట్లు చెప్పారు.

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి


ఇంద్రన్(ఫైల్)

సైదాబాద్: బైక్ అదుపు తప్పి కిందపడడంతో తలకు తీవ్రగాయలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందిన సంఘటన సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల ప్రకారం.. సైదాబాద్ పూసలబస్తీకి చెందిన ఆటో డ్రైవర్ కావేటి గౌరిశంకర్ కుమారుడు కె. ఇంద్రన్(22) బుధవారం తెల్లవారుజామున బైక్‌పై తిరిగి వస్తూ ఇంటి సమీపంలో అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ఘటనలో తలకు తీవ్రగాయాలు కాగా కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య


చెట్టుకు వేలాడుతున్న మనోహర్ మృతదేహం

అబ్దుల్లాపూర్‌మెట్: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లాకు చెందిన పేరం మనోహర్‌రెడ్డి(45) ఇరవై ఏళ్ల క్రితం నగరానికి వలసవచ్చాడు. భార్య శివకుమారి, ఇద్దరు పిల్లలతో కలిసి వనస్థలిపురంలో ఉంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. కొంత కాలంగా అతడు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. కాగా బుధవారం కొన్ని ప్రైవేటు స్కూల్స్ ప్రారంభం కావడంతో తన ఇద్దరు పిల్లలను బైక్‌పై తీసుకెళ్లి స్కూల్‌లో వదిలేశాడు. అక్కడి నుంచి ఇంటికి వెళ్లకుండా పెద్దఅంబర్‌పేట్ ఔటర్ రింగురోడ్డు సమీపంలో బలిజగూడ గ్రామ పరిధిలోని ఏఎల్‌నగర్ వెంచర్‌లోకి వెళ్లాడు. అక్కడ తన బైక్ ను పార్కు చేసి వెంట తెచ్చుకున్న తాడుతో ఓ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వివరాలు సేకరించి మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్టులు

చాదర్‌ఘాట్ : కాళేశ్వరం బ్యారేజీల కుంగుబాటుపై విచారణలో భాగంగా జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు మాజీ సీఎం కేసీఆర్ హాజరుకానున్న నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా మలక్‌పేటలోని పలువురు బీఆర్‌ఎస్ నాయకులను బుధవారం మలక్‌పేట, చాదర్‌ఘాట్ పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. మలక్‌పేట బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి తీగల అజిత్‌రెడ్డి, మూసారాంబాగ్ డివిజన్ అధ్యక్షుడు చల్లారి రఘునందన్‌రెడ్డి, గౌర శశిధర్‌లను మలక్‌పేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తీగల అజిత్‌రెడ్డి అన్న తీగల రంజిత్‌రెడ్డి అనారోగ్యంతో మృతిచెందడంతో తాను అంత్యక్రియలు నిర్వహించే కార్యక్రమంలో ఉన్నట్లు పోలీసులకు వివరించడంతో అదుపులోకి తీసుకున్న కొద్ది సేపటికే వదిలిపెట్టారు. ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు పగిళ్ల నర్సింగ్, లాలాజీ మహేష్, అనిల్‌ను చాదర్‌ఘాట్ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. తర్వాత కొద్ది సేపటికి పోలీసులు వీరిని వదిలిపెట్టారు.